వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 221 మంగళవారం | 05 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# గంజాయితో పట్టుబడ్డ ప్రభుత్వ ఉద్యోగి?



2లో..

మహబూబాబాద్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగిగా గుర్తింపు ?

రహస్యంగా విచారణ చేస్తున్న పోలీసులు



# కాళేశ్వరంపై దాగుడుమూతలు



## హద్దుమీరుతున్న విమర్శలు

బీజేపీ అభాసుపాలయ్యే ఛాన్స్

కేసీఆర్ అవినీతిపై చర్యలు నిల్లు..

కాంగ్రెస్ ఏం చేస్తోందని మోడీ దాడి

తెలంగాణకు బీజేపీ చేసిన మేలేంటీ..

కాళేశ్వరం పేరుతో కేసీఆర్ దగా..

పదేళ్లుగా మోడీ ఏం చేశారని ప్రతివిమర్శలు

దొంగే దొంగా.. దొంగా అన్నట్లుగా ఇప్పుడు బీఆర్ఎస్ తెలంగాణలో విమర్శలు చేయడంలో ముందు వరసలో నిలిచింది. పథకం ఏద్కెనా దానిపై విమర్శలు చేయడం మొదలు పెట్టింది. తెలంగాణను దోచుకున్న ఓ కుటుంబ సభ్యులు ఇప్పుడు అధికారం దక్కక పోవడంతో వచ్చిన ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత వచ్చిందని నంగనాచి కబుర్లు చెబుతున్నారు. పదేళ్ల పాటు ప్రజలపై స్వారీ చేసి, వారిని అణచివేసి, తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కి, పెద్దమనుషులుగా చలామణి అయిన వారే ఇప్పుడు... అధికారలేమితో ఆయాసపడుతున్నారు. - వరంగల్ వాయిస్, ప్రతినిధి



వివరాలు 2లో...




8లో..

# మోడీ పాలనకు చరమగీతం పాడాలి

ఎంసీపీఐ(యూ) భారీ ప్రజా ప్రదర్శన

ఎర్రజెండాలతో ఎరుపెక్కిన వరంగల్ నగరం



2లో..

# ప్రజా పాలన తప్పుల సవరణకు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు

కలెక్టర్ సిక్తా పట్నాయక్



8లో..

# మెట్టుగుట్టపై నూతన ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మంగళవారం 05, మార్చి 2024
www.warangalvoice.net

# కాళేశ్వరంపై దాగుడుమూతలు



**హద్దుమీరుతున్న విమర్శలు**

**బీజేపీ అభాసుపాలయ్యే ఛాన్స్**

**కేసీఆర్ అవినీతిపై చర్యలు నిల్లు..**

**కాంగ్రెస్ ఏం చేస్తోందని మోడీ దాడి**

**తెలంగాణకు బీజేపీ చేసిన మేలేంటీ..**

**కాళేశ్వరం పేరుతో కేసీఆర్ దగా..**

**పదేళ్లుగా మోడీ ఏం చేశారని ప్రతి విమర్శలు**

**వరంగల్ వాయిస్, ప్రతినిధి:** దొంగే దొంగా.. దొంగా అన్నట్లుగా ఇప్పుడు బీఆర్ఎస్ తెలంగాణలో విమర్శలు చేయడంలో ముందు వరసలో నిలిచింది. పథకం ఏదైనా దానిపై విమర్శలు చేయడం మొదలు పెట్టింది. తెలంగాణను దోచుకున్న ఓ కుటుంబ సభ్యులు ఇప్పుడు అధికారం దక్కక పోవడంతో వచ్చిన ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత వచ్చిందని నంగనాచి కబుర్లు చెబుతున్నారు. పదేళ్ల పాటు ప్రజలపై స్వారీ చేసి, వారిని అణచివేసి, తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కి, పెద్దమనుషులుగా చలామణి అయిన వారే ఇప్పుడు...అధికారలేమితో ఆయాసపడుతున్నారు.

### ప్రధాని మోడీవి అబద్దాలు..

కాళేశ్వరంపై కేంద్రం ఓ కమిటీని అధ్యయనం కోసం ఏర్పాటు చేసింది. ప్రాజెక్ట్ సమర్థతపై అధ్యయనం చేయనుంది. ఇదంతా కూడా రాష్ట్ర అభ్యర్థన మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే కాళేశ్వరంపై హైకోర్టులో జ్యుడిషియల్ విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. ఇవన్నీ తెలిసి కూడా బీఆర్ఎస్ యాగీ చేస్తోంది. కానీ ప్రధాని మోడీ కూడా పరిస్థితి, నిజాలు తెలిసి కూడా విమర్శలు చేయడం ఆయన పదవికి హుందాగా లేదనే చెప్పాలి. 'కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తోందని అంటూ ఆదిలాబాద్ వేదికగా చేసిన విమర్శలు ప్రధాని మోడీ అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టాయి. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోందని చెప్పడం ద్వారా పచ్చి అబద్దాలు వల్లించారు.

### కేసీఆర్ అవినీతిపై చర్యలేవీ..

బీఆర్ఎస్‌తో కుమ్మక్కు అవుతోందని, కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మీరు తిన్నారంటే మీరు తిన్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారని చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాక మరోటి కాదు. ఎందుకంటే కాళేశ్వరంలో జరిగిన అవినీతే కాదు, అక్రమ, నాసిరకం కట్టడంపై కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే చర్యలకు పూనుకుంది. కానీ కేంద్రం ఈ విషయంలో కేసీఆర్‌ను వెనకేసుకుంటూ వచ్చింది. అవినీతీ కేసుల్లో రక్షణ ఇచ్చింది. ఇక్కడ కేసీఆర్, అక్కడ జగన్‌లను అవినీతి కేసుల్లో రక్షిస్తూ మోడీ మాట్లాడడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది.

### తెలంగాణకు చేసిన మేలేంటీ..

నిజానికి బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇది పదేపదే మోడీ ప్రస్తావించారు. మరి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయంటే శూన్యం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించడం ద్వారా తన హోదాను తక్కువ చేసుకున్నారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేసిన ప్రధాని తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పివుంటే బాగుండేది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించే ముందు నిజాలు తెలుసుకుంటే మంచిది. రాజకీయ విమర్శలు చేసేముందు తమ హోదాను గుర్తు పెట్టుకుంటే మంచిది.

### కాళేశ్వరం పేరుతో దగా..

నిజానికి నీళ్లు నిధులు, నియామకాల నినాదంతో ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటయింది. దాదాపు దశాబ్దంపాటు ఏలిన కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను నిలువునా మోసం చేసింది. ప్రాజెక్టుల పేరుతో అప్పనంగా దోచేసుకున్నారు. ఉమ్మడి ఏపీలో అదే నినాదాన్ని ఎన్నికల ఆయుధంగా మలుచుకొని మరికొన్ని ఆకర్షణీయమైన హామీలతో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. తెలంగాణ సమాజం నూతనంగా ఏర్పడ్డ రాష్ట్రం నుంచి, మరీ ముఖ్యంగా ఉద్యమాల నుంచి ఉద్భవించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అద్భుతంగా పునర్నిర్మిస్తుందని అందరూ ఆశించారు. కానీ అప్పులు చేసి ప్రజలను వంచించారని తేలింది. అభివృద్ధి కోసమే అప్పులు చేశామని నమ్మబలికారు. కేవలం ఓ కుటుంబం కోసం తెలంగాణను తెచ్చుకున్నట్లు అయ్యింది. పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వ పాలన తర్వాత నేడు వెనక్కి చూస్తే ఎంతగా మోసపో యామో తెలుసుకుని ఆశ్చర్యపడాల్సి వస్తోంది. కాళేశ్వరం పేరుతో ఎంత దగా చేశారో కళ్లకు కడుతోంది.

### బీజేపీవి దిగజారుడు రాజకీయాలు..

ఈ అవినీతిని గత పదేళ్లలో పదేపదే వల్లించిన మోడీ ఏనాడూ కేసీఆర్‌పై లేష మాత్రం చర్యకు కూడా దిగలేదు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి తెలంగాణను తిరోగమనంలోకి తీసుకెళ్లిందని విమర్శలు చేసిన బీజేపీ పెద్దలు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలి. ఇవేవీ చేయకుండా ఇప్పుడే అధికారం చేపట్టి, అవినీతి బూజు దులుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్‌తో పోల్చడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

### ప్రజలకిచ్చే సందేశం ఏంటీ..

ఉమ్మడి రాష్ట్రంలో మొదల్కైన పలు సాగునీటి ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నా...వాటిని పూర్తిచేసే బాధ్యతను పక్కనపెట్టి, రీడిజైనింగ్ పేరుతో నిర్మాణ వ్యయాన్ని పెంచి, కాళేశ్వరం లాంటి తెల్ల ఏనుగులను సృష్టించిన అపర విశ్వామిత్రుడు మన కేసీఆర్. ప్రాణహిత%--% చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టును పక్కన పెట్టి కాళేశ్వరంతో దాదాపు లక్ష కోట్లు బూడిదలో పోశారు. అందిన కాడికి దోచుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కావలసిన అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి పొంది సుమారు రూ.38 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేసేందుకు పూనుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా మార్చి, పూర్తిస్థాయిలో రీడిజైనింగ్ కార్యక్రమం మొదలు పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం తానే నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, మేడిగడ్డ ప్రాంతంలో బ్యారేజ్ కట్టాలని నిర్ణయించి ముందుకు వెళ్ళడం, ఇప్పుడది ఏ రూపంలో ఉందో ప్రపంచానికి తెలిసి వచ్చింది. దీనిపై కేంద్రం ఏనాడ్కైనా చర్య తీసుకుందా అంటే లేదు. ఎందుకంటే లోపాయకారి అవగాహన అని చెప్పక తప్పదు. మరి అలాంటి వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వబోతున్నారు.

### లిక్కర్ కేసులో కవితను కాపాడుతూ..

బీఆర్ఎస్‌తో లోపాయకారి ఒప్పందం కారణంగానే లిక్కర్ కేసులో కవితను దాచిపెట్టారని ప్రజలు గుర్తించలేదని అనుకుంటున్నారా..? కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలంటే మరొక రూ.50,000 కోట్లు అవసరం ఉంటుందని స్పష్టమవుతుంది. అంతేకాకుండా ఇప్పటికే ఖర్చు చేసిన లక్ష కోట్ల పెట్టుబడికి ఎలాంటి ఫలితం రాలేదని అర్థమవుతుంది. వీటితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అశాస్త్రీయమైనదని ఆర్థికంగా లాభసాటి కాదని స్పష్టంగా కాగ్ నివేదికలో పేర్కొనబడింది. కాగ్ నివేదిక అంతా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనిదే కదా..దీనిపై ప్రధాని మోడీ ఎందుకు అధ్యయనం చేయలేదో చెప్పాలి. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని తెలిసినా మిన్నకున్న కేంద్రం ఇప్పుడు కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా అభాసుపాలయ్యిందే తప్ప మరోటి లేదు. రాజకీయాల్లో హుందాతనం అలవర్చుకుంటే మంచిదని మోడీ లాంటి వారు గుర్తించాలి.

## ప్రజా పాలన తప్పుల సవరణకు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా పాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు సంబంధించిన సరైన వివరాలను నమోదు చేసేందుకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజా పాలన సేవా కేంద్రాలలో లబ్ధిదారుల పూర్తి వివరాలను ఆపరేటర్లు నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎంపీడీవోలకు సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఎంపీడీవోలు, జీడబ్ల్యూఎంసీ, పరకాల పురపాలక శాఖ అధికారులతో మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్, గృహజ్యోతి పథకాల కు దరఖాస్తు చేసుకున్న ప్రజలు ఏవైనా వివరాలు ఇవ్వనట్లయితే వాటిని సరిచేసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలలో ప్రజల నుంచి వచ్చే వివరాలు ఏవిధంగా నమోదు చేయాలనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకానికి సంబంధించి గ్యాస్ కనెక్షను నెంబరు, గృహ జ్యోతి సంబంధించిన విద్యుత్ మీటర్ నెంబర్ తో పాటు రేషన్ కార్డ్, ఆధార్ కార్డు పూర్తి వివరాలు ప్రజా పాలన దరఖాస్తులో ఉండాలన్నారు. ప్రజా పాలన దరఖాస్తులలో గ్యాస్ నెంబరు, విద్యుత్ సర్వీస్ నెంబర్ ఇవ్వనివారు, అసమగ్ర వివరాలను ఇచ్చినవారు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలలో సరిచేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వివరాలను ఎలాంటి తప్పులు చోటు చేసుకోకుండా ఆపరేటర్లు నమోదు చేసే విధంగా ఎంపీడీవోలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జడ్పీ సీఈవో విద్యాలత, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, డీఆర్డీఓ నాగ పద్మజ, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల పురపాలక శాఖ కమిషనర్ నరసింహ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సిరిమల్లె వెంకటనారాయణకు అవార్డు

**హర్షం వ్యక్తం చేసిన పద్మశాలీలు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పుత్తూరు వెంకటేశ్వరరావు స్మారక ఉత్తమ పాత్రికేయ పురస్కారాన్ని అందుకున్న కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ, సీనియర్ జర్నలిస్టు సిరిమల్లె వెంకటనారాయణకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అభినందనలు తెలిపింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన సిరిమల్లె వెంకటనారాయణ అంతర్జాతీయంగా అనేక పత్రికలకు వ్యాసాలు వ్రాసి కొన్ని ముఖ్య పత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించారు. అంతేకాక, ఢిల్లీలో ఇంటర్నేషనల్ మీడియా అసోసియేషన్ కు చైర్మన్ గా వ్యవహరిస్తూ ప్రసిద్ధిగాంచిన గొప్ప జర్నలిస్టుగా ఉన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రముఖ జర్నలిస్టు పుత్తూరు వెంకటేశ్వరరావు స్మారక ఉత్తమ పాత్రికేయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మన పద్మశాలి ముద్దుబిడ్డకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ వ్యవస్థాపక హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## గంజాయితో పట్టుబడ్డ ప్రభుత్వ ఉద్యోగి?

**మహబూబాబాద్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగిగా గుర్తింపు ?**

**రహస్యంగా విచారణ చేస్తున్న పోలీసులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలో గంజాయి తరలిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరం నుంచి పలు ప్రాంతాలకు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు రహస్యంగా విచారణ చేస్తున్నట్లు వినికిడి. మహబూబాబాద్ ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్నసదరు ఉద్యోగి కిలో గంజాయితో పోలీసులకు చిక్కాడని, సోమవారం అర్ధరాత్రి వరంగల్ డివిజన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. పీఎస్ కు తీసుకొచ్చి పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# 'లోక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోవాలి

## కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె. సుజాత



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఈ నెల 4 నుంచి 16 వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో నిర్వహించే "లోక్ అదాలత్" ను సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె. సుజాత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఇన్ స్పెక్టర్ కె.సుజాత మాట్లాడుతూ కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టుబడ్డ వాహన దారులు, డ్రంకెన్ డ్రైవ్ లో గాని, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులలో గాని , మైనర్ డ్రైవింగ్ కేస్ లలో గాని మీ వాహనం సీజ్ చేయబడితే ఈ నెల 4 నుంచి 16 వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో "లోక్ అదాలత్" ఉందని తెలిపారు. కాబట్టి, మీ పై కానీ, మీకు తెలిసిన వాళ్లపై గాని ఏమైనా కేసులు ఉంటే, మీరు కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయబడుతుందన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు, వారి ఆధార్ కార్డ్ జిరాక్స్, వెహికల్ డాకుమెంట్స్ తీసుకొని రావాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్సు కేసులు ఉన్నవారుమీ సేవలో లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు తీసుకుని రావాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించిన కేసులు ఉన్నవారు, బర్త్ సర్టిఫికెట్, లేక ఎస్సెస్సీ మెమో మొదలైనవి తీసుకుని రావాలన్నారు. ఈ "లోక్ దాలత్" లో తక్కువ జరిమానాతో కేసులను క్లోజ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కేసులు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# 54వ డివిజన్‌ను ఆదర్శంగా నిలుపుతా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 54వ డివిజన్ పోచమ్మ కుంటలో మంగళవారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి డివిజన్ పర్యటన చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హనుమాన్ దేవాలయం ఎదుట అపూర్వ ఎంక్లేవ్ వద్ద 20లక్షలతో పైప్ లను అభివృద్ధి పనులను ప్రారభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ మహిళా సంఘాలకు, వడ్ల సంఘాలకు ఉప్పర కుల సంఘాలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తానన్నారు. కాలనీలో తిరుగుతూ రోడ్లు, డ్రైన్ ను మున్సిపల్ ఏఈ, డీఈలతో కలిసి పరిశీలించారు. అలాగే డివిజన్ లో పోచమ్మకుంట శ్మశాన వాటికిను మోడల్ స్మశాన వాటికను చేస్తానని, డివిజన్ ను మోడల్ డివిజన్ గా మారుస్తానని అన్నారు. అవసరమైన వాటికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈ, డీఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, గుంటి కుమార్, కూర సురేందర్, మాజీ కార్పోరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, డివిజన్ అధ్యక్షుడు కొండుక ప్రదీప్ కుమార్, నల్ల సత్యనారాయణ, గుంటి స్వప్న, వరుణ్ గౌడ్, సుమన్, సురేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మృతదేహాలకు ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పర్వతగిరి మండల పరిధిలోని మోత్యతండాలో దుర్గమ్మ పండుగ సందర్భంగా సోమవారం సాయంత్రం టెంట్ (పాండా) వేస్తుండగా ప్రమాదవశాత్తు11 కేవీ కరెంట్ వైర్లు తెగిపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించటంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం పరామర్శించి వారి మృతదేహాల దగ్గరుండి మంగళవారం ఎంజీఎం హాస్పిటల్ పోస్ట్ మార్టం చేయించారు. మృత దేహాలకు పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలియజేసి వారి స్వస్థలాలకు పంపించారు.

# ఎల్ఆర్ఎస్ రద్దుకై బీఆర్ఎస్ ధర్నా

## కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలుపుకోవాలి
## ఉచితంగా ఎల్ఆర్ఎస్ అన్నమాట ఉత్తిదేనా
## కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవ రెడ్డి, సుందర్ రాజు యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవ రెడ్డి, సుందర్ రాజు యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడారని అన్నారు. అప్పటి సీఎల్పీ నేత బట్టి విక్రమార్క ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ఎవరు ప్రభుత్వానికి డబ్బులు కట్టవద్దని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి డబ్బులు దోచుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని విమర్శించడాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క (ఎల్ఆర్ఎస్ ) లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ను ఉచితంగా చేస్తామని చెప్పారని, అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు మాట మార్చుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల రక్తం పిండడానికి మళ్లీ ఎల్ఆర్ఎస్ ను ప్రవేశపెట్టిందని ఆరోపణలు చేశారు. అప్పుడు మాట్లాడినటువంటి వారు ఇప్పుడు కేబినెట్ లో ఉండి మార్చి 31 లోపల ఎల్ఆర్ఎస్ కట్టుకోవాలని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా అప్పటి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేల మంది లబ్ధిదారులు రూ. వెయ్యి కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇప్పుడు వారిపై లక్షల రూపాయల భారాన్ని మోపేందుకు ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. తద్వారా 20,000 కోట్ల రూపాయలు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులు ఎవరూ కూడా డబ్బులు కట్టకూడదని, ఎలాంటి రుసుము లేకుండా వారికి ఎల్ఆర్ఎస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజల తరఫున ఉద్యమం చేపడతామని తీవ్రంగా హెచ్చరించారు. అందుకోసం బుధవారం ఉదయం 10 గంటలకు హనుమకొండ ఏకశిలా పార్కు సమీపంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. దీనికి బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, జోరిక రమేష్, మట్టపెల్లి రమేష్, జానకి రాములు, పరశురాం, మనోజ్ రఘు, కనకరాజు, చాగంటి రమేష్, శ్రీకర్, శ్రీధర్, సదాంత్, శ్రీకాంత్, కృష్ణ, అఫ్జల్, వినయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జీరో బిల్లు రాలేదని టెన్షన్ వద్దు..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. జీరో బిల్స్ వస్తున్నాయి. అయితే కొందరికి జీరో బిల్స్ రాకపోవడంతో అందోళన చెందుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం కీలక సూచనలిస్తోంది. మార్చి మొదటి వారంలో వచ్చే ఫిబ్రవరికి సంబంధించిన బిల్లులు జీరోగా వస్తున్నాయి. అర్హులకు జీరో బిల్స్ జారీ చేయడానికి గాను బిల్లింగ్ మిషన్స్ లో ప్రత్యేకమైన సాఫ్ట్ వేర్ ఇన్స్టాల్ చేశారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు, రేషన్ కార్డు ఆధారంగా అర్హులైన వారికి బిల్లింగ్ మిషన్స్ లో నుంచి ఆటోమేటిక్ గా జీరో బిల్ వచ్చేలా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించారు. అయితే ప్రజాపాలనలో అప్లై చేసి ఉన్నప్పటికీ కొందరికి జీరో బిల్స్ రావడం లేదు. దీంతో జనాల్లో టెన్షన్ నెలకొంది. ప్రభుత్వం చెబుతున్నట్లు తమకు తెల్ల రేషన్ కార్డు ఉందిగా అయినా జీరో బిల్ రాలేదంటే.. తాము ఇక ఈ గృహ జ్యోతి పథకానికి అర్హులం కామేమో అని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల నడుమ పలువురు అధికారులు, ప్రజలకు కీలక సూచనలు చెబుతున్నారు. జీరో కరెంట్ బిల్ రాలేదని టెన్షన్ పడాల్సిన పనిలేదని, జీరో బిల్స్ రానివారు మీ తెల్ల రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు, జత చేస్తూ స్థానిక మున్సిపల్/ ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని చెబుతున్నారు. ప్రజాపాలనలో అప్లై చేసుకొని తెలంగాణ ప్రజలకు ఒకింత ఊరట లభించింది. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వాడితేనే.. వారికి ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుంది. ఉచితంగా ఇస్తున్నారు కదా అని ఇష్టానుసారం కరెంట్ వాడితే.. అది 200 యూనిట్లు దాటితే.. మీకు ఉచిత పథకం వర్తించదు. పూర్తి కరెంట్ బిల్లు చెల్లించాల్సిందే.

# డాక్యుమెంటరీని ఆవిష్కరించిన తహసీల్దార్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాలు చరిత్ర గలిగిన శ్రీమత్స్యగిరి స్వామి చరిత్రను తెలియజేస్తూ ఆర్ సినీ ట్యూబర్ చేరాల రాకేష్ తీసిన డాక్యుమెంటరీ మంగళవారం శాయంపేట తహసీల్దార్ సుభాషిని ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంటరీలో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చరిత్ర, పూజా కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, చేరాల రాకేష్ పాల్గొన్నారు.

# ఆర్టీఐని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



## ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత సంపత్ రావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత సంపత్ రావు అన్నారు. సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు పోస్టర్ ను సంపత్ రావు ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు, సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లినా పని చేయించుకోవడం, తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005న ఈ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని ఉపయోగించుకొని ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రతి భారత పౌరుడు సామాజిక బాధ్యతగా అవినీతి అక్రమాలను నిరోధించడానికి పేద ప్రజలకు ఆర్టీఐ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్రవంతి, ఆర్టీఐ ఉమ్మడి వరంగల్ జిల్లా యువజన అధ్యక్షుడు నమిండ్ల హరీష్, వరంగల్ జిల్లా యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కెల్లి పవన్ కళ్యాణ్, వరంగల్ జిల్లా యువజన ఉపాధ్యక్షులు మంద ప్రవీణ్, బోయిని నగేష్ సురేష్, మనోజ్, అరుణ్ కుమార్, సిలువేరు సురేష్, విష్ణు, సంధ్య, భోగం స్వామి పాల్గొన్నారు.

# సందేశ్ కాళీ సంఘటన నిందితులను ఉరితీయాలి

## ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో సందేశ్ కాళీ ఘటనకు నిరసనగా భీమారంలో టీఎంసీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ" సందేశ్ కాళీ ప్రాంతంలోని మహిళలు జిహాదీ గ్రూపు ద్వారా లైంగికంగా దోపిడీకి గురవుతున్నారు. వారి గుర్తింపును ఉల్లంఘిస్తున్నారు. బాధిత మహిళల్లో చాలా మంది అత్యంత వెనుకబడిన, షెడ్యూల్ తరగతులకు చెందినవారు. సందేశ్ కాళీ స్త్రీద్వేషానికి వ్యతిరేకంగా నిలబడటం మన బాధ్యత. గత కొన్ని రోజులుగా దేశం అంతా చర్చనీయాశమైన ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ అధికార పార్టీ నాయకులు, షాజహాన్ షేక్, అతడి అనుచరులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని సందేశ్ కాళీ ఒక మారుమూల గిరిజన తెగ ప్రాంతంలోని ప్రజలపై దాడులు, అక్రమ భూ కబ్జాలు, మహిళలపైన లైంగిక దాదులు చేయడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మహిళలను ఒక లైంగిక యంత్రాలుగా చూస్తూ, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని అధికార పార్టీ నాయకులు మహిళలను వివిధ రకాలుగా వేధిస్తూ పార్టీ కార్యాలయాలకు రప్పించుకొని మరీ హత్యాచారాలు చేయడం యావత్ సమాజం సిగ్గుతో తలదించుకునే దుస్థితి అన్నారు. మమతా బెనర్జీ ఒక మహిళ ముఖ్యమంత్రి అయినటువంటి రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. దీనిపై సీఎం మమతా బెనర్జీ స్పందించకపోవడం వెనుక ఉన్న కారణం ఏమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనను యావత్ సమాజం ప్రశ్నిస్తుందని, సందేశ్ కాళీ సంఘటన పైన వెంటనే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారోజు యశ్వంత్ , రేవంత్, సాయి తేజ, సర్దార్, పవన్, సుశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన డీపీఆర్వో రాజేంద్రప్రసాద్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రప్రసాద్ మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండల కేంద్రంలో గల శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి సమేత కురవి వారిని దర్శనం చేసుకొని అనంతరం తన విధులకు హాజరయ్యారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ లను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బీజేపీకి మూడోసారి 400 సీట్లు

## ఎస్సీ మోర్చా నేత మాదాసు రాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ 39వ డివిజన్‌లో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మూడోసారి గెలుపుతో పాటు 400 సీట్లను కైవసం చేసుకుంటుందని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూస్తున్నాయని, ప్రపంచ పెద్దన్నగా మన ప్రధాని మోడీని గుర్తించాయన్నారు. నిన్నటి సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రేమగా నా పెద్దన్న నరేంద్ర మోడీ, ఆయన ఆశీస్సులు ఉంటే గుజరాత్ లాగా తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామని అని వ్యాఖ్యానించడం చాలా గర్వకారణమన్నారు. ఈ ఎన్నికల్లో 17 స్థానాలకు 17 గెలిచేందుకు ప్రచారానికి ముందుకు వెళ్తామని వచ్చే ఎన్నికల్లో మళ్లీ మూడోసారి మోడీ ప్రధానమంత్రి అవుతారని చెప్పారు.

# విశ్వ కర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేతి వృత్తులలో అనుభవం కలిగిన వారికి వారి జీవనోపాధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వ కర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లోని సీఆర్ సీ భవన్ లో టీఎంసీ రమేష్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్ లో ఎంతోమంది చేతి వృత్తులలో అనుభవం కలిగినప్పటికీ నేటి సమాజంలో ఆధునికరమైన పరికరాలు లేక చేతి వృత్తులలో రాణించలేకపోచున్నారన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ వృత్తులలో నైపుణ్యం కలగడానికి ప్రభుత్వం తరఫున ట్రైనింగ్ ఇస్తూ తగిన పారితోషికం పదిహేను వేల రూపాయల విలువ గల పరికరాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. టీఎంసీ రమేష్ మాట్లాడుతూ 18 వివిధ వృత్తుల వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారు ఉంటే మెప్మా ద్వారా పరిశీలనకు రావడం జరుగుతుందని, అర్హత కలిగిన వారికి ట్రైనింగ్ ఇస్తూ బ్యాంకుల ద్వారా ఒక లక్ష రూపాయలు రుణం ఇప్పించుటకు తేదీలలో సక్రమంగా రుణాలు చెల్లించిన వారికి ఒక్క లక్ష నుంచి మూడు లక్షల రూపాయల లోన్లు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో ఆర్పీలు, చేతి వృత్తులకు చెందిన వ్యక్తులు హాజరయ్యారు.

# పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి

## సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత రాచర్ల బాలరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 6 గ్యారంటీలతో పాటు ఏడవ గ్యారెంటీగా ప్రజాస్వామిక పాలనను వాగ్దానం చేసింది. కానీ, ఫిబ్రవరి 14న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ ను, వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గోవన్నను, జిల్లా నాయకులు ఎస్కె మదార్, కె. సురేష్ లను ఖమ్మం పరిసరాలలో అరెస్టు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఫిబ్రవరి 17న ఇల్లందు సమీపంలోని పూసపల్లిలో వీరిని అరెస్టు చేసినట్లు చూపించారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత రాచర్ల బాలరాజు అన్నారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్-ఖమ్మం జిల్లాలోని పాకాల కొత్తగూడెం, గంగారాం, బయ్యారం, ఇల్లందు మండలాల పరిధిలోని గ్రామాలు, తండాలు, గూడెలలో సాయుధ పోలీసులు భారీ కూంబింగ్ ల పేరిట అనేక మందిని కొట్టారు. భయ బీభత్సానికి గురి చేస్తూనే ఉన్నారు. పూసపల్లి కుట్ర కేసులో దాదాపు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వం మొత్తాన్ని ఇరికించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్రన్నతో పాటు కేంద్ర రాష్ట్ర నాయకులను ప్రజాసంఘాల నాయకులపై 120-బీ కుట్ర కేసును బనాయించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మొగిలి ప్రతాపరెడ్డి, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ తో పాటు మొత్తం 24 మందిపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసును బేషరతుగా ఎత్తివేయాలని కోరారు.

# క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తొర్రూర్ పిలుపు మేరకు తొర్రూర్ డీఎస్పీ సురేష్ అంబేద్కర్ మిని బ్యాడ్మింటన్ కోర్టుకు విచ్చేసి స్నేహపూర్వక మ్యాచ్ ఆడారు. మ్యాచ్ ఆడిన తదుపరి బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక క్రీడాకారుడు క్రమశిక్షణతో ప్రతి రోజూ ప్రాక్టీస్ చేసి ఉన్నత శిఖరాలకు చేరి తొర్రూరు మండలానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. అదేవిధంగా ప్రతి వ్యక్తి ప్రతి రోజూ గంట సేపు వ్యాయామం చేసినట్లయితే మంచి శరీర ధృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులకు సహాయం చేసేందుకు పోలీసు శాఖ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మడిపెద్ది వెంకన్న, ప్రధాన కార్యదర్శి రవీందర్, స్పోర్ట్స్ ఇంచార్జి జలకం శివకుమార్, క్రీడాకారులు కేదారి, నట్టె శేఖర్, సుధాకర్, అజయ్, స్వామి, సోమాచారి, శ్రీను, జయప్రకాష్, మహేష్, క్రీడాకారులు

# ఫ్రూట్ స్టాల్‌ను ప్రారంభించిన మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేని నిరుద్యోగులు చిన్న చిన్న వ్యాపారాలు చేపట్టినట్లయితే బ్యాంకుల ద్వారా ఇప్పించడానికి కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు సీఆర్ సీ భవనం వద్ద బాబా ఏర్పాటు చేసుకున్న ఫ్రూట్ స్టాల్ ను కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి సిద్ధార్థ రెడ్డి, మెప్మా టీఎంసీ రమేష్, సీఓ సునీత, నాయకులు మరుపల్ల గౌతం, మచ్చ కవిత, సమీనా, ఆడెపు శ్యామ్, ఆర్పీలు ఉన్నారు.

# లక్ష్యంతో చదివితే సర్కారు కొలువులు సొంతం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుద్యోగ యువత లక్ష్యంతో చదివితే సర్కారు కొలువులు సులువుగా సాధించగలరని తెలిపారు. జ్యోతి రావు పూలే గురుకుల టీచర్ ఉద్యోగానికి ఎంపికైన పోలీస్ పరిపాలన సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం అభినందించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగం జూనియర్ అసిస్టెంట్, ప్రస్తుతం వెస్ట్ జోన్ డీసీపీ క్యాంప్ క్లర్క్ గా విధులు నిర్వహిస్తున్న బి సునీల్ కుమార్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గురుకుల టీచర్ ఉద్యోగ నియామకాల్లో పూలే గురుకుల టీచర్ ఉద్యోగానికి ఎంపికై నిన్నటి రోజున అధికారుల నుంచి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వస్తూనే ప్రభుత్వ శాఖలోని మరో ఉన్నత ఉద్యోగాన్ని సాధించినందుకు పోలీస్ కమిషనర్ సునీల్ కుమార్ ను అభినందించారు.

# వేసవిలో తాగునీటి సమస్యలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో ఉన్న వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులతో వేసవికాలంలో ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వేసవికాలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఎస్.కె సిలార్ సాహెబ్ పలు అంశాలపై చర్చించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎండీ గౌస్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ లబ్ది చేకూరేలా చర్యలు

## ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జిలతో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదుపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రజాపాలన సాఫ్ట్ వేర్ ద్వారా లబ్దిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదేవిధంగా మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేశామని, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందన్నారు. గృహ జ్యోతి క్రింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తు దారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా తప్పులను సవరించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవల కేంద్రాలలో నూతన దరఖాస్తులను స్వీకరించడం లేదని ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మకూడదని అన్నారు. ప్రజలు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు పెళ్లిరోజు సందర్భంగా ముక్తేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** కాళేశ్వర ముక్తేశ్వర స్వామి సన్నిధిలో మహాదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకారి రాజబాబు అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్ హెల్త్ మెడికల్ ఫ్యామిలీ సెక్రెటరీ అండ్ కమిషనర్ శైలజ, ఐటీ పరిశ్రమలు శైలజ అయ్యర్, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్ బాబుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేవెల్లి మమత, జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మాచర్ల సారయ్య, సీతయ్య, హైదర్, ప్రచార కమిటీ అధ్యక్షుడు షకీల్, ఉపాధ్యక్షుడు తాజోద్దీన్ బాబా, మహిళ నాయకురాలు లేతకారి కవిత, యూత్ అధ్యక్షుడు నిట్టూరి నగేష్, యూత్ నాయకులు అరుణ్, సంతోష్, మైనార్టీ నాయకులు ఫరీద్ పాల్గొన్నారు.

# సందేశ్ కాళీ ఘటన నిందితులను ఉరి తీయాలి

## ఏబీవీపీ వరంగల్ జిల్లా గజ్జల దేవేందర్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** సందేశ్ కాళీ ఘటన నిందితులను ఉరి తీయాలని, టీఎంసీ పార్టీని బ్యాన్ చేయాలని ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గజ్జల దేవేందర్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ లోని సందేశ్ కాళీ లో మహిళల పై అత్యాచారాలు, ఆదివాసీల భూములు లాక్కొని కబ్జా చేస్తున్న అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షాజహాన్ షేక్, తన ప్రైవేట్ గుండాల అనుచరులు చేస్తున్న ఆగడాలను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పశ్చిమ బెంగాల్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సందేశ్ కాళీలోని ఆదివాసీలపై అత్యాచారాలకు పాల్పడుతూ, ఆడవాళ్లను తమ పార్టీ భవనానికి తీసుకొని వెళ్తూ హత్యా చేస్తున్న దారుణాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఇలాంటి ఘటనలు కనిపించడం లేదా అని మండి పడ్డారు. అక్కడా ఎలాంటి హత్యలు, మాన భంగాలు జరిగిన కేవలం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే ఆ ఘటనలో నేరస్తులుగా ఉంటున్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన మొదలుపెట్టాలన్నారు. ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లీడర్లను ఉరి తీయాలని, బాధిత మహిళలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం, ప్రధాని నరేంద్ర మోడీ పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమంతో కలిగే ప్రయోజనాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 18 కులాలకు చేతివృత్తులు చేసుకునే వారికి భరోసానిస్తూ వారికి ట్రైనింగ్ క్లాసెస్ ఇస్తూ ట్రైనింగ్ లో ఒక రోజుకు రూ.500 అందిస్తూ ట్రైనింగ్ అయిపోయిన తదనంతరం వారికి టూల్ కిట్లు రూ.15 వేలు, అర్హులైన వారికి తక్కువ వడ్డీ రుణాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు కూడా నారి శక్తి అభియాన్ ద్వారా డ్వాక్రా గ్రూపులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించడం లాంటి ప్రయోజనాలు బీజేపీ ప్రభుత్వం కల్పిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీని మరోసారి ప్రధానమంత్రిగా చేయాలని దీనికి అందరూ కమలం గుర్తుకు ఓటు వేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలో 17 సీట్లు వచ్చేలా అందరూ సహకరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లాఅధ్యక్షురాలు రావు పద్మారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో నాంపల్లి శ్రీనివాస్, బెజ్జంకి పూర్ణాచారి, శ్రీనివాస్ యాదవ్, కృష్ణమాచారి, వలబోజు శ్రీనివాస్, గాజుల సంపత్, తిలక్, మహిళా నాయకురాళ్లు, ఓబీసీ నాయకులు అందరూ పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా పల్లెల అభివృద్ధి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రణాళికాబద్ధంగా పల్లెల అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం ఉమ్మడి రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లో రావులపల్లి గ్రామంలో సుమారు రూ.5లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, వెంకటేశ్వరపల్లి, గాంధీనగర్, విజ్జయ్యపల్లి గ్రామాల్లో ఒక్కో భవనానికి సుమారు రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో తెలంగాణలో స్వేచ్ఛలేదని, ప్రజలు నిర్బంధం, నియంతృత్వం, అవీనీతి, కుటుంబపాలన నుంచి విముక్తి పొందారన్నారు. అందరి తలరాతలు మార్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ప్రజాపాలనతో ఆరు గ్యారెంటీలు అమలు కాబోతున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్మిన పార్టీ కాంగ్రెస్ అని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే చరిత్ర కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, సీనియర్ నాయకులు గూడూరు కిష్టయ్య మేకల భిక్షపతి, బండారి దేవేందర్, రేగొండ మాజీ ఎంపీటీసీ పట్టేం శంకర్,యూత్ నాయకులు బోయినీ వినోద్ కుమార్, గాంధీనగర్ గ్రామ అధ్యక్షులు బైకాని కుమార్, ఉపాధ్యక్షులు కాషాబోయిన సారంగం, పసుల నరేష్, కోశాధికారి బొజ్జం లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోటే రాజు, నాయకులు కోటే ఓదెలు, బొజ్జమ్ ఎల్లయ్య, ఓజాల ఐల్లయ్య, యూత్ నాయకులు సైకి సురేందర్, నిజ్జాంపల్లి గ్రామ అధ్యక్షులు శ్రీరాం రాజు, ఉపాధ్యక్షుడు సందేల మధుకర్, ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకుడు యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి లక్కర్సు వినయ్ కుమార్ , నాద్రే రవీందర్, అశోక్ ఆవల లింగరావు, రాయినేని మొగిలి, కర్రే రాంబాబు పాల్గొన్నారు.

# 7న డీఎంహెచ్ఓ ఆఫీస్‌ల ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరికీ 3 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎన్ హెచ్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రతి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయాల ఎదుట ఈ నెల 7న ధర్నా నిర్వహిస్తున్నట్లుత తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నరసింహ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, పీఎఫ్ వివరాలు తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగికి ఇచ్చే బేసిక్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ 33 జిల్లాల నుంచి ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరూ పాల్గొని ఈనెల 7 న వారి డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా గౌతమ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలోని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తనయుడు జీఎంఆర్ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ గౌతమ్ రెడ్డి జన్మదిన వేడుకలు గండ్ర గౌతమ్ రెడ్డి వీరాభిమాని బొజ్జం ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గౌతమ్ రెడ్డి జన్మదిన కేక్ ను కట్ చేసి,శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్ పాషా, యుగేందర్ యాదవ్, గండ్ర వీరాభిమాని దాట్ల రాజేందర్, బావండ్లపల్లి శోభన్, సాదు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 05, మార్చి 2024
www.warangalvoice.net

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, గణపురం :** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి, మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం, ఆరోగ్యశ్రీ పెంపు ,సబ్సిడీపై గ్యాస్, ఉచిత 200 యూనిట్ల విద్యుత్ ,ఇచ్చిన హామీల్లో కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కావటి రజిత-రవీందర్, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కన్నబోయిన కుమార్, కోఆప్షన్ సభ్యులు ఎండీ చోటేమియా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, ఎంపీటీసీ కాలియా సాగర్, నాయకులు వడ్లకొండ నారాయణ గౌడ్, గుజ్జ గంగాధర్ రావు, బోనాల రాజమౌళి, ఒద్దుల అశోక్ రెడ్డి, మామిండ్ల మల్లికార్జున గౌడ్, కటుకూరి శ్రీనివాస్, మామిడి నరసింహ స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సులో మరిపెడ కవికి సన్మానం




**వరంగల్ వాయిస్, మరిపెడ :** తెలుగు శాఖ మద్రాస్ విశ్వ విద్యాలయం చెన్నై అంతర్జాతీయ సదస్సులో కవిత్రయ మహా భారతం వర్తమాన సమాజం-సమాలోచనం అంతర్జాతీయ సదస్సు జరిగింది. మహా భారత కవిత్రయం కవులు మానవ జీవన విధనంపై వాసిలి వసంత్ కుమార ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సులో మరిపెడ పట్టణానికి చెందిన ప్రముఖ కవి విమర్శకులు పెద్దోజు నరేష్ పాల్గొన్నారు. ఆయన పత్ర సమర్పణ చేశారు. ఆచార్య విస్తాలి శంకర్ రావు చేతుల మీద సన్మానం ప్రశంసా పత్రం పొందారు ఈ కార్యక్రమంలో ఆచార్య లింగబసవ శంకర్ రావు, డా.బత్తిని అశోక్ కుమార్, డా.కాలియప్ప,డా.అబ్రూని, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## మొదటి ప్రయత్నంలోనే విజేతగా నిలిచిన దివ్య



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు మండలం గుర్తూరు గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది జెల్ల.భాస్కర్ భార్య బొర్ర దివ్య తెలంగాణ గురుకులం ఫలితాలలో మొదటి ప్రయత్నంలో బయోలజికల్ సైన్స్ విభాగంలో ఉద్యోగం సాధించింది. చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉంటూ 10వ తరగతి ఇంటర్ క్లాస్ లో డివిజన్ టాపర్ గా నిలిచి 2015లో కొన్ని మార్కులతో మెడిసిన్ సీట్ కోల్పోయి, పట్టువదలని విక్రమార్కుడిలా ప్రణాళిక బద్దంగా చదువుతూ భర్త ప్రోద్బలంతో మొదటి ప్రయత్నంలో విజయం సాధించింది. ఇద్దరు పిల్లలు ఉన్న కూడా క్రమశిక్షణతో చదివి, సాధించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, కుటుంబ బాధ్యతలు తన లక్షానికి అడ్డుకాదని నిరూపించారు. దివ్య సాధించిన విజయం పట్ల భర్త, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు అభినందనలు తెలిపారు.

# దేశంలో నూతన ఆవిష్కరణలకు పెద్దపీట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎస్ ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రభావం స్కీం సౌలభ్యత, దాంతో కలిగిన ఉపయోగాల మీద ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఐసీఎస్ఎస్ ఆర్ ఫండింగ్ ప్రాజెక్ట్ నిర్వహణ కర్త డాక్టర్ సుమన్ కుమార్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా మంగళవారం ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఐటీ వరంగల్ ఇన్నోవేషన్ హెడ్ డాక్టర్ శిరీష్ సోనా వాణి, ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చన రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ భారతదేశం చాలా అత్యంత ఉత్సాహంతో ఇన్నోవేషన్, స్టార్ట్ అప్ కార్యక్రమంలో పాల్గొంటుందని, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తుందని, గత ఐదు సంవత్సరాల్లో చూస్తే గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ ప్రపంచంలో ఆవిష్కరణ పట్ల నిర్వహించే ర్యాంకింగ్ లో 80 ర్యాంకులో నుంచి మనం 38వ ర్యాంకుకు ఎగబాకినట్టు తను పేర్కొన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం కూడా ప్రత్యేకంగా అభివృద్ధి చెందుతున్న స్టార్ట్ అప్ ఎకో సిస్టంగా ఇండియాలో గుర్తింపు పొందిందన్నారు. టీఎం లాంటి సంస్థలు చాలా ప్రత్యేకమైన ఆవిష్కరణలు చేసి మనందరికీ ముందు నిలబడి నడిపిస్తున్నాయని తెలిపారు. ఎన్ఐటీ వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ టీ హబ్, ఐకేపీ, సీసీఎంబీ లాంటి ప్రముఖ సంస్థలు అందరూ కలిసి ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ స్టార్ట్ అప్ ఎకో సిస్టంలో అందరినీ బాధ్యతలు చేస్తూ ముందుకు తీసుకువెళ్తున్నారని, ఇది మంచి పరిణామం అని, రాబోయే కాలంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అర్చనా రెడ్డి మాట్లాడుతూ ఎస్ఆర్ యూనివర్సిటీ అటల్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్ అచీవ్ మెంట్ లో 2020 సంవత్సరానికి వరల్డ్ ర్యాంక్ వచ్చిందన్నారు. యూనివర్సిటీ కార్యక్రమాల్లో కోర్స్ వర్క్ లను పిల్లలను ఉత్సాహపరుస్తూ ముబాకన్ చేస్తున్నామని తెలిపారు. సో ఇన్నోవేషన్ ఎంట్రిప్రెనిషిప్ చుట్టుగా ప్రతి కోర్సులో వాటికి వెయిటేజ్ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలి

### జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశ ప్రజలకు రైతులకు అనేకమైన హామీలు ఇచ్చి ఏ ఒక్కటి అమలు చేయలేదని, ప్రజల హామీలు మరిచిన బీజేపీని రానున్న ఎంపీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్ అన్నారు. మంగళవారం గీసుకొండ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని, అదే విధంగా విదేశాల్లో దాచిన నల్లధనాన్ని బయటికి తీసి ప్రతి ఒక్కరి అకౌంట్ లో వేస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. బీజేపీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ కుల, మతాల మధ్య ఘర్షణలను సృష్టించుతూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తుందని విమర్శించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణను 7 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. అందుకే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ల కు ప్రజలు, రైతులు, యువకులు, మేధావులు, కవులు, కళాకారులు తగిన బుద్ధి చెప్పి వారిని ఓడించాలని కోరారు.

## ఒకేసారి రెండు ప్రభుత్వ కొలువులు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కష్టపడితే కానిది అంటూ ఏదీ లేదని నిరూపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడి గ్రామానికి చెందిన పగిండ్ల నర్సయ్య ఒకేసారి రెండు ప్రభుత్వ కొలువులు సాధించి సత్తా చాటారు. నిరుపేద రజక కుటుంబంలో పుట్టి చిన్నప్పటి నుంచిఎన్నో కష్టాలను ఎదుర్కొని ఎంఏ బీఈడీ పూర్తి చేశారు. 12 సంవత్సరాల నుంచి ఒక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తూనే, గతేడాది రాష్ట్ర గురుకుల విద్య సంస్థ అధ్యాపక పోస్టుల కోసం పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో జూనియర్ కళాశాల లెక్చరర్, టీజీటీ సోషల్ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం గురుకులం జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్ట్ ను ఎంచుకున్నట్లు తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, రాంపూర్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్ పరిధిలోని స్టేషన్ పెండ్యాలలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ డ్రైనేజీ అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ స్టేషన్ పెండ్యాల గ్రామ పెద్దలు కాలనీవాసులు, యువకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి గుర్రై రైతు మృతి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యుత్ ఘాతానికి గుర్రై రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఉల్లేపల్లి గ్రామ శివారు ఆకెరు వాగు వద్ద మంగళవారం చోటుచేసు కుంది. చేపల కోసం గుర్తు తెలియని వ్యక్తులు కరెంటు వైరు పెట్టగా అటు నుంచి బావి దగ్గరకు వెళుతున్న రైతు ఆంబోతు ఎల్లయ్యకు కరెంట్ తీగ తాకడంతో విద్యుత్ ఘాతానికి గుర్రై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అందాల ఆరబోతలో పోటీపడుతున్న రాశీఖన్నా

టాలీవుడ్ సుందరి రాశీ ఖన్నా అందాల ప్రదర్శనలో ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజు అంతకుమించి అనేలా దూసుకెళుతుందే తప్పితే ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్‌ను సైడ్‌కు పెట్టి పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి పెట్టిన ఈ ముద్దుగుమ్మ అక్కడ పోటీలో నిలబడేందుకు, అవకాశాలు పట్టేయడానికి గ్లామర్ డోస్ పెంచుతూ పోతూ ఇక్కడ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెడుతోంది.వారం రోజుల క్రితం అసలు బట్టలు ఉన్నాయా లేవా అనే విధంగా బట్టలు వేసుకుని ఫొటోషూట్లు చేసిన ఈ చిన్నది.. మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో అందాల ప్రదర్శన చేసి అభిమానులకు కనులవిందు చేసింది.తాజాగా రెడ్ అవుట్ ఫిట్‌లో డ్రెస్‌ను జార విడిచి మరి అందాలను చూపిస్తూ మెస్మరైజ్ చేసింది. దీంతో అభిమానులు సినిమాలు లేకున్నా ఫర్లేదు మూడు రోజులకోసారి ఈ మాత్రం దర్శనం ఇస్తే చాలు అనేంత వరకు ఫ్యాన్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సిద్దార్థ్ మల్హోత్రా తో కలిసి యోధ అనే వార్ ఓరియంటెడ్ సినిమాలో నటించగా అది త్వరలో విడుదలకు రెడీ అయింది. ఇక తెలుగులో డీజే టిల్లు స్టార్ జోన్నలగడ్డ సిద్దుతో కలిసి చేస్తున్న తెలుసుకదా అనే చిత్రం తప్పితే మరో చిత్రానికి సంతకం చేయలేదు.ఇక హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ పార్ట్2 లో నటించనుంది.






# చాలా ఆసక్తిగా ఉన్నా..

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందబోయే సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే నిర్మాణ సంస్థ నుంచి గానీ, దర్శకుడి నుంచి గానీ ఇప్పటిదాకా అధికారికంగా ఎలాంటి అప్‌డేట్ లేదు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి స్పందిస్తూ, 'మహేశ్‌తో సినిమా తీస్తున్నా. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ టైటిల్ ఇంకా ఖరారు కాలేదు' అని అన్నారు. ఇప్పుడు మహేశ్‌బాబు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరొక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'రాజమౌళి సర్‌తో చేసే సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు చాలా బాగా జరుగుతున్నాయి. త్వరలోనే ఆయనతో ప్రయాణం మొదలుపెట్టడానికి చాలా ఆసక్తిగా ఉన్నా' అని అన్నారు. ఈ అప్‌డేట్‌తో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు నన్ను బాగా ప్రభావితం చేసి, నా కెరీర్‌ను మలుపు తిప్పాయని మహేశ్ బాబు అన్నారు. డిఫరెంట్ స్టోరీ లైన్లతో తెరకెక్కించిన ఈ చిత్రాలు ఆడియన్స్ కు నన్ను మరింత దగ్గర చేశాయి. ప్రేక్షకులకు నచ్చేలా సినిమాలు చేయాలని నైతిక అంశాల ఆధారంగా కథను ఎంపిక చేసుకుంటాను. ఒకే రకమైన పాత్రల్లో నటించడం నాకు నచ్చదు. వ్యక్తిగత విలువలకు దగ్గరగా ఉంటూ, నా స్వభావాన్ని అభిమానులకు తెలియజేసేలా ఉన్న పాత్రలు పోషిస్తా. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు ముఖ్యమైనప్పటికీ సినిమా ప్రేక్షకులపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొంటున్నా. అందులో భాగంగానే 'గుంటూరు కారం'లో నటించాను. నా అభిమానులే ఇందుకు కారణం. ఒక సినిమాకు సైన్ చేశానంటే అది పూర్తయ్యేదాకా దర్శకుడి విజన్ ప్రకారమే నడుచుకుంటా' అని మహేశ్ బాబు అన్నారు.

# ప్రభాస్‌తో మళ్లీ ..

మార్చి 8, మహా శివరాత్రికి 'భీమా' సినిమా విడుదల కానుంది. గురించి గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమా అన్ని భావోద్వేగాలు కలగలిపిన ఒక వాణిజ్యపరమైన సినిమా. తప్పకుండా ఆడుతుంది అనే నమ్మకం మాత్రం వుందని చెప్పారు. దర్శకుడు హర్ష ఈ కథ నాకు చెప్పేటప్పుడు, భీమా పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఇంతకు ముందు పోలీసాఫీసర్ పాత్రలు చేసినా అందులో కథ అంతా ఆ పోలీసు పాత్ర చుట్టూ తిరుగుతాయి, కానీ ఇందులో అలా కాదు, వేరేలా ఉంటుంది, ఒక చిన్న సెమి ఫాంటసీ కూడా ఉంటుంది, ఆ పాయింట్ కొత్తగా ఉండటమే కాకుండా నాకు బాగా నచ్చి ఈ సినిమా చేసాను అని గోపీచంద్ చెప్పారు.'భీమా'లో కూడా రెండు పాత్రలు ఒకటి పోలీసాఫిసర్, రెండోది ఒక శక్తివంతమైన పాత్ర వున్నాయి. 'అఖండ' సినిమాతో ఈ 'భీమా' పోల్చడం నాకైతే మంచిదే అనిపిస్తుంది. ప్రతి సినిమా విజయం సాధించాలని ప్రతి నటుడు కష్టపడి చేస్తారు. ఇప్పుడు ఒక్క ప్రభాస్ కి తప్పితే ఏ నటుడూ కూడా పాన్ ఇండియా సినిమాలు చెయ్యడం లేదు, ఆ నటులకి కథలు రాయటం లేదు. ఎప్పటికైనా ప్రభాస్ తో మళ్ళీ కలిసి సినిమా చెయ్యాలని వుంది అని చెప్పారు గోపీచంద్. తన రాబోయే సినిమాల గురించి మాట్లాడుతూ దర్శకుడు శ్రీను వైట్ల తో సినిమా 30 శాతం పూర్తయిందని, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తో ఒక సినిమా ఉందని చెప్పారు.





# బన్నీతో కలిసి మరోసారి..

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించింది అగ్ర కథానాయిక సమంత. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ కాలేజీ ఫెస్ట్‌లో పాల్గొన్న సమంతను కొందరు స్టూడెంట్స్ 'నటనలో మీకు స్ఫూర్తి ఎవరు?' అని అడిగారు. 'యాక్టింగ్‌లో నాకు అల్లు అర్జున్ స్ఫూర్తి అని సమాధానమిచ్చింది. తనతో కలిసి మరోసారి సినిమా చేయాలనుకుంటున్నా. ఎందుకంటే యాక్టింగ్ బీస్ట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు బన్నీ' అని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ వీడియోలను బన్నీ ఫాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. గతంలోనూ ఓ సందర్భంలో సమంత ఇదే విషయాన్ని చెప్పింది. అల్లు అర్జున్ తన సూపర్ హీరో అని చెప్పింది. వీళ్లిద్దరూ కలిసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి'లో నటించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా చక్కని విజయాన్ని అందుకొంది. అలాగే సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'పుష్ప'లో అల్లు అర్జున్, సమంత 'ఊ అంటావా..' పాటకు స్టెప్పులేశారు. ఈ పాట పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది. ఇందులోనూ ఓ ఐటెమ్ సాంగ్ ఉందని టాక్. అయితే ఇందులో ఆ పాటలో సమంత కనిపిస్తారా లేక వేరే హీరోయిన్ ఎవరైన కనిపిస్తార అన్నది తెలియాల్సి ఉంది.



# మోడీ పాలనకు చరమగీతం పాడాలి

## ఎంసీపీఐ(యూ) భారీ ప్రజా ప్రదర్శన

## ఎర్రజెండాలతో ఎరుపెక్కిన వరంగల్ నగరం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశ సంపదను కొల్లగొట్టి మతోన్మాద విధానాలతో ప్రజా సమస్యలను గాలికొదిలి పెట్టుబడుదారులకు దోచిపెడుతున్నబీజేపీ మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని, సామాజిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి పిలుపునిచ్చారు. మంగళవారం కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) పిలుపుమేరకు ఎంసీపీఐ(యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచం మైదాన్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. మతోన్మాద కార్పొరేట్ ప్రజా వ్యతిరేక విధానాలను నశించాలి, ప్రజాస్వామ్యం పరిరక్షించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన గాదగోని రవి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అయినా భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసే విధంగా మనువాద నియంతృత్వ విధానాలకు పాల్పడుతూ మోడీ ప్రభుత్వం రైతుల కార్మికుల ప్రజల హక్కులను కాలరాస్తున్నదని గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి అప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన కొనసాగిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛని హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సంకల్పంతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల ఐక్యతను చీల్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని భారతదేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బీజేపీ మోడీ పాలనకు ముగింపు పలకాలని అవినీతి అవకాశవాద రాజకీయ పార్టీలను సైతం ఓడించాలని ఆ దిశలో అన్ని వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎన్ రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుల మంద రవి, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమురయ్య, గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, కనకం సంధ్య, మాస్ సావిత్రి, కంచ వెంకన్న, కన్నం వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు కందికొండ కుమారస్వామి, కొత్తకొండ రాజమౌళి, ఎండీ ఇస్మాయిల్, గుగులోతు అరుణ్, ఎల్లబోయిన రాజు, ఎగ్గని మల్లికార్జున్, ఐతం నాగేష్, అప్పనపూర్ నర్సయ్య, ఎండీ ఉస్మాన్, మంద భద్రయ్య, జూలూరి ఇందు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై సమగ్ర విచారణ జరపాలి

## సీఎం రేవంత్‌ను కోరిన బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఖండించారు. హైదరాబాద్ లో మంగళవారం అయన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో చాలామంది కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నారన్న సంగతి తెలుసుకొని, వారు పార్టీ నుంచి వెళ్లిపోతారనే భయంతోనే, నిస్సహాయ పరిస్థితుల్లోనే కేసీఆర్ పైపైకి బీరాలు పలుకుతున్నాడని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ మరిచిపోతే ఎలా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్దంగా పూర్తి మెజారిటీతో ఏర్పాటై, ప్రజా రంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని పడగొడతా మంటున్న కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి కూడా పాల్గొన్నారు.

# గడువులోగా పనులను పూర్తి చేయండి

## పనుల ప్రగతిపై సమీక్షించిన కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వాణితో కలిసి వరంగల్ నగరంలో కొనసాగుతున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల పురోగతిని ఆధికారులతో సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో అడిషనల్ డీఎంఈ శివరాంప్రసాద్, కాళోజి నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్ రెడ్డి ఎంజీఎం, కేఎంసీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, మోహన్ దాస్, ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెట్టుగుట్టపై నూతన ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

## హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ వాయిస్, మడికొండ :** చారిత్రక మెట్టుగుట్టపై దక్షిణ కాశీ, హరి హర క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి క్షేత్రాలలో మంగళవారం వర్ధన్నపేట శాసనసభ్యుడు నాగరాజు శ్రీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం నూతనంగా నియమించబడిన ధర్మకర్తల మండలి సభ్యులచే వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు సమక్షంలో వరంగల్ విభాగం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు సంజీవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ధర్మకర్తల మండలిలో చైర్మన్ గా పైడిపాల రఘు చందర్, ధర్మకర్తలుగా బైరి రాజు, వస్కుల ఉమా, దండిగం శ్రీనివాస్, రోడ్డ దయాకర్, భోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఎక్స్ అఫీషియో మెంబర్ గా రాగిచేడు అభిలాష్ శర్మ నియమింపబడ్డారు. ఈనెల 6 నుంచి 14 వరకు జరుగు మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా, 8న మహాశివరాత్రి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి స్వామివారి దర్శనార్థమై విచ్చేయు భక్తుల సౌకర్యార్థమై వీఐపీ(దర్శనం) పాసులు రద్దు చేస్తున్నట్లుగా ఎమ్మెల్యే నాగరాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచెడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, శేఖర్ రావు, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్, గాజర్ల అశోక్, మర్రి ప్రభాకర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్ వస్కుల నాగరాజు, పెండ్లి కృష్ణమూర్తి, మన్నె బాబు, పల్లపు అర్జున్, కొప్పుల నవీన్, వస్కుల శ్రీనివాస్, వస్కుల శివ నాగరాజు, పల్లపురాజు, గుర్రం అమర్నాథ్, కొత్త కృష్ణారెడ్డి, ముంజ రమేష్, ముచ్చ అజయ్, కామిని మల్లేష్, కంచరపల్లి వెంకటయ్య, తాడూరి మోహన్, భక్తులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com